రేగన్ స్మిత్ ప్రపంచ రికార్డు

ఇండియానాపోలిస్: అమెరికన్ స్విమ్మర్ రేగన్ స్మిత్ 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో ప్రపంచ రికార్డు సృష్టించింది. యూఎస్ ఒలింపిక్ ట్రయల్స్‌లో భాగంగా.. మంగళవారం రాత్రి జరిగిన ఈవెంట్‌లో 22 ఏండ్ల రేగన్.. 57.13 సెకన్లలోనే గమ్యాన్ని చేరుకుంది. తద్వారా ఏడాది క్రితం ఆస్ట్రేలియా స్విమ్మర్ కైలీ మెక్‌కియోన్ నెలకొల్పిన 57.33 సెకన్ల రికార్డు కనుమరుగైంది.

కెప్టెన్సీకి కేన్ గుడ్‌బై

- సెంట్రల్ కాంట్రాక్టూ తిరస్కరణ

క్రిస్ట్‌చర్చ్: న్యూజిలాండ్ క్రికెట్ జట్టు పరిమిత ఓవర్ల సారథి కేన్ విలియమ్సన్ కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. టీ20 ప్రపంచకప్‌లో భారీ ఆశలతో బరిలోకి దిగిన ఆ జట్టు నిరాశజనక ప్రదర్శనలతో గ్రూపు దశలోనే నిష్క్రమించిన నేపథ్యంలో అతడు సారథ్య పగ్గాలను వదిలేశాడు. రెండేండ్ల క్రితమే టెస్టు జట్టు సారథ్యాన్ని వదులుకున్న విలియమ్సన్.. తాజాగా వైట్‌బాల్ కెప్టెన్సీ బాధ్యతల నుంచీ వైదొలిగాడు. సారథిగా తప్పుకున్న అతడు.. 2024-25 సీజన్‌లో సెంట్రల్ కాంట్రాక్టునూ వదులుకోవడం గమనార్హం. కుటుంబంతో మరింత సమయం గడిపేందుకే కాంట్రాక్టును తిరస్కరించినా వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)నకు అందుబాటులో ఉంటానని అతడు వెల్లడించాడు. 2016లో కెప్టెన్సీ పగ్గాలు అందుకున్న విలియమ్సన్ సారథ్యంలో కివీస్ 40 టెస్టులు, 91వన్డేలు, 75 టీ20లు ఆడింది. అతడి హయాంలోనే 2019 వన్డే ప్రపంచకప్, 2021 టీ20 ప్రపంచకప్‌లలో న్యూజిలాండ్ ఫైనల్‌కు చేరింది. 2021లో ఐసీసీ తొలిసారిగా నిర్వహించిన డబ్ల్యూటీసీ టైటిల్ విజేతగా నిలిచింది.

శతక గర్జన

కౌర్, మంధాన సూపర్ సెంచరీలతో విజృంభణ

కౌర్ (103*)

1 మహిళల వన్డే క్రికెట్ చరిత్రలో నలుగురు బ్యాటర్లు సెంచరీలు చేయడం ఇదే తొలి సారి. ఈ మ్యాచ్‌లో మంధాన, హర్మన్‌ప్రీత్‌కౌర్, వోల్వార్డ్, కాప్ సెంచరీలు చేశారు.

మంధాన (136)

దక్షిణాఫ్రికాపై భారత్ ఉత్కంఠ గెలుపు

వోల్వార్డ్, మరిజానె కాప్ సెంచరీలు వృథా

రెండో వన్డేలో రికార్డుల హోరు

భారత్ 325/3, దక్షిణాఫ్రికా 321/6

బెంగళూరు: స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌ను భారత మహిళల క్రికెట్ జట్టు మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో సొంతం చేసుకుంది. బెంగళూరులోని చిన్నస్వామి వేదికగా బుధవారం ఉత్కంఠగా జరిగిన 'హై స్కోరింగ్ థ్రిల్లర్'లో టీమ్‌ఇండియా.. 4 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. స్మృతి మంధాన (120 బంతుల్లో 136, 18 ఫోర్లు, 2 సిక్సర్లు) వరుసగా రెండో సెంచరీతో కదం తొక్కగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (88 బంతుల్లో 103 నాటౌట్, 9 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ శతకంతో నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 325 పరుగుల భారీ స్కోరు చేసింది. మాల్బుకు(2/51) రెండు వికెట్లు దక్కాయి. భారీ ఛేదనలో 67 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా.. సారథి లారా వోల్వార్డ్ (135 బంతుల్లో 135 నాటౌట్, 12 ఫోర్లు, 3 సిక్సర్లు), మరిజానె కాప్ (94 బంతుల్లో 114, 11 ఫోర్లు, 3 సిక్సర్లు) పోరాడినా ఆ జట్టు 321/6 వద్దే ఆగి విజయానికి 4 పరుగుల దూరంలో నిలిచిపోయింది. కీలక సమయంలో వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా అందుకు మూల్యం చెల్లించుకుంది. పూజ వస్త్రాకర్(2/54), దీప్తి శర్మ(2/56) రెండేసి వికెట్లు తీశారు. కౌర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

1 స్వదేశంలో వన్డేల్లో భారత్‌కు ఇదే అత్యుత్తమ స్కోరు (325/3)

15 రెండో వన్డేలో నమోదైన సిక్స్‌లు. మహిళల వన్డేలో ఇదే అత్యధికం.

646 మహిళల వన్డేల్లో ఇది రెండో అత్యుత్తమ స్కోరు. 2017లో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ మ్యాచ్‌లో 678 పరుగులు నమోదయ్యాయి.

సంక్షిప్త స్కోర్లు

సంక్షిప్త స్కోర్లు: **భారత్:** 50 ఓవర్లలో 325/3(మంధాన 136, హర్మన్‌ప్రీత్‌కౌర్ 103 నాటౌట్, మాల్బు 2/51, క్లాస్ 1/67), **దక్షిణాఫ్రికా:** 50 ఓవర్లలో 321/6(వోల్వార్డ్ 135 నాటౌట్, కాప్ 114, వస్త్రాకర్ 2/54, దీప్తి 2/56)

'హండ్రెడ్'లో ఐపీఎల్ ఫ్రాంచైజీల పెట్టుబడులు?

లండన్: ఇంగ్లండ్ వేదికగా జరిగే 'ది హండ్రెడ్'లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీలు పెట్టుబడులు పెట్టనున్నాయి. ఈ విషయాన్ని మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) చీఫ్, వెటరన్ కామెంటేటర్ మార్క్ నికోలస్ వెల్లడించాడు. ది హండ్రెడ్‌లో ఫ్రాంచైజీగా ఉన్న 'లండన్ స్పిరిట్'లో వాటాలు దక్కించుకునేందుకు ఐపీఎల్ జట్లు ఆసక్తిగా ఉన్నాయని ఆయన తెలిపాడు. ఈ ఏడాది అక్టోబర్‌లో నికోలస్.. లండన్ స్పిరిట్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నాడు. అయితే హండ్రెడ్‌లో పెట్టుబడులు పెట్టబోయే ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఏవన్నది మాత్రం అతడు వెల్లడించలేదు.

భారత్‌కు 'బార్సిలోనా' గుడ్‌బై

జూలై 1 నుంచి అన్ని అకాడమీలు బంద్

ఢిల్లీ: ప్రఖ్యాత ఫుట్‌బాల్ ఫ్రాంచైజీ 'బార్సిలోనా ఎఫ్‌సీ' భారత్‌లో తమ కార్యకలాపాలకు ముగింపు పలికింది. జూలై 1 నుంచి భారత్‌లో ఉన్న అకాడమీలను మూసివేస్తున్నట్టు తన అధికారిక వెబ్‌సైట్‌లో వెల్లడించింది. భారత్‌లో యువ ఫుట్‌బాలర్లను ప్రోత్సహించేందుకు గాను 'బార్కా అకాడమీ'ల పేరిట 2010లో.. భారత్‌లోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, పుణెలో అకాడమీలను ఏర్పాటు చేసింది. స్పెయిన్‌లో మాదిరిగా భారత్‌లో పిల్లలకు ఈ అకాడమీలలో శిక్షణ ఇప్పించింది.

సూపర్‌గా ఆడితేనే!

నేడు భారత్-అఫ్గాన్ పోరు • విరాట్ కోహ్లీ పుంజుకునేనా?

రోహిత్

రషీద్

రాత్రి 8 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియోలో ప్రత్యక్ష ప్రసారం

బార్బడోస్: పొట్టి ప్రపంచకప్‌లో గ్రూప్ దశను విజయవంతంగా ముగించిన భారత క్రికెట్ జట్టు గురువారం నుంచి కీలకమైన సూపర్-8 సవాల్‌కు సిద్ధమవుతోంది. వెస్టిండీస్‌లోని బార్బడోస్ వేదికగా అఫ్గానిస్థాన్‌తో జరుగబోయే తొలి పోరుకు రోహిత్ సేన అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంది. లీగ్ దశలో అంచనాలకు మించి రాణించిన అఫ్గాన్.. పటిష్టమైన బౌలింగ్ యూనిట్‌తో 'మెన్ ఇన్ బ్లూ'కు షాకిచ్చేందుకు సిద్ధమైన నేపథ్యంలో భారత్‌కు విజయం అంత సులువు అయితే కాదు. న్యూయార్క్‌లో పేస్‌కు అనుకూలించిన 'డ్రాప్ ఇన్ పిచ్'పై ఆడిన భారత్.. సూపర్ 8లో దానికి పూర్తి భిన్నంగా స్పిన్నర్లకు అనుకూలంగా ఉండే కరీబియన్ గడ్డమీద ఆడనుండటంతో ఇరు జట్ల మధ్య రసవత్తర పోరు ఖాయంగా కనిపిస్తోంది.

అందరి కండ్లూ కోహ్లీపైనే..

ఈ టోర్నీలో ఆడిన మూడు మ్యాచ్‌లలోనూ దారుణంగా విఫలమైన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (1,4,0).. సూపర్-8 దశలో అయినా ఫామ్‌లోకి రావాలని భారత్ కోరుకుంటోంది. రోహిత్‌శర్మతో ఓపెనర్‌గా వస్తున్న కోహ్లీ.. సింగిల్ డిజిట్‌కే పరిమితమవడంతో తర్వాత వచ్చే బ్యాటర్లపై ఆ భారం తీవ్రంగా పడుతోంది. స్పిన్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌లపై భారత్.. మణికట్టు స్పిన్నర్ కుల్దీప్‌యాదవ్‌ను తుది జట్టులో ఆడించే అవకాశాలున్నాయి. కుల్దీప్ ఫైనల్ లెవన్‌లో ఉంటే సిరాజ్/అర్షదీప్‌లో ఎవరో ఒకరు బెంచ్‌కే పరిమితం అవ్వాల్సి వస్తుంది. పేస్ బాధ్యతలు బుమ్రా మోయనుండగా.. జడేజా, అక్షర్, హార్దిక్, దూబే రూపంలో నాణ్యమైన ఆల్‌రౌండర్లు ఉండటం భారత్‌కు కలిసిరానుంది. స్పిన్ బాగా ఆడగలిగే దూబేకు న్యూయార్క్ పిచ్ ఆ అవకాశమివ్వకపోయినా విండీస్ పిచ్‌లపై అతడు స్పిన్నర్లను ఎలా ఎదుర్కొంటాడనేది ఆసక్తికరంగా మారింది.

అఫ్గాన్‌తో అంత వీజీ కాదు..

గత కొంత కాలంగా నిలకడైన ప్రదర్శనతో అగ్రశ్రేణి జట్లను సైతం వణికిస్తున్న అఫ్గాన్ ఫుల్ జోష్‌లో ఉంది. ఆ జట్టు పేసర్ ఫజల్‌హక్ ఫరూఖీ ఆరంభంలో కొత్త బంతితో నిప్పులు చెరుగుతుండగా మధ్య ఓవర్లలో రషీద్ ఖాన్, మహ్మద్ నబీ, ఉమర్‌జయ్ ప్రత్యర్థిని కట్టడిచేస్తున్నారు. ఇక బ్యాటింగ్ విషయానికొస్తే ఓపెనర్లు గుర్బాజ్, జద్రాన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. టోర్నీలో అత్యధిక పరుగుల(గుర్బాజ్-167)తో పాటు వికెట్లు (ఫరూఖీ-12) తీసినవారిలో అఫ్గాన్ ప్లేయర్లే ఉండటం గమనార్హం. భారత్ ఏమాత్రం ఆదమరిచినా ఆ అవకాశాన్ని రెండు చేతులా ఒడిసిపట్టేందుకు రషీద్ ఖాన్ గ్యాంగ్ రెడీగా ఉంది.

సఫారీ జోరు

మెరిసిన డికాక్, రబాడా

సూపర్-8లో శుభారంభం

పోరాడి ఓడిన యూఎస్ఏ

అంటిగ్వా: టీ20 ప్రపంచకప్ సూపర్-8 దశలో యూఎస్ఏతో ఆడిన తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా కష్టపడి గెలిచింది. ఈ టోర్నీలో ఆడిన గత నాలుగు మ్యాచ్‌లలోనూ కనీసం 120 (115 అత్యధికం) పరుగులు చేయడానికి నానాతంటాలు పడ్డ సఫారీ బ్యాటర్లు.. యూఎస్ఏతో మాత్రం జూలు విదిల్చడంతో బుధవారం అంటిగ్వా వేదికగా జరిగిన పోరులో మార్క్‌రమ్ సేన 18 పరుగుల తేడాతో నెగ్గింది. క్వింటన్ డికాక్ (40 బంతుల్లో 74, 7 ఫోర్లు, 5 సిక్సర్లు), కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్ (32 బంతుల్లో 46, 4 ఫోర్లు, 1 సిక్స్) తో పాటు ఆఖర్లో హెన్రిచ్ క్లాసెన్ (22 బంతుల్లో 36 నాటౌట్, 3 సిక్సర్లు) మెరుపులతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 194 పరుగులు చేసింది. భారీ ఛేదనలో యూఎస్ఏ.. 11.1 ఓవర్లకు 76/5గా ఉన్నా ఆండ్రిస్ గోస్ (47 బంతుల్లో 80 నాటౌట్, 5 ఫోర్లు, 5 సిక్సర్లు), హర్మీత్ సింగ్ (22 బంతుల్లో 38, 2 ఫోర్లు, 3 సిక్సర్లు) పోరాటంతో విజయానికి చేరువగా వచ్చినా కీలక సమయంలో వికెట్లు కోల్పోయి 20 ఓవర్లలో 176/6 వద్దే ఆగిపోయింది. ప్రొటీస్ బౌలర్లలో రబాడా (3/18) రాణించాడు. డికాక్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

మోత మోగించిన డికాక్:

తొలుత సౌతాఫ్రికా.. నేత్రవల్కర్ వేసిన 3వ ఓవర్లో ఓపెనర్ హెండిక్స్ (11) వికెట్ కోల్పోయింది. కానీ ఆ తర్వాత ఓవర్ నుంచే అసలు కథ మొదలైంది. మార్క్‌రమ్‌తో జత కలిసిన డికాక్. మార్క్‌రమ్‌తో కలిసి రెండో వికెట్‌కు 116 పరుగులు జోడించాడు. ఆఖర్లో క్లాసెన్, స్టబ్స్ (20 నాటౌట్) మెరుపులతో ఆ జట్టు యూఎస్ఏ ఎదుట భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

డికాక్ (74)

సంక్షిప్త స్కోర్లు:

దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 194/4 (డికాక్ 74, మార్క్‌రమ్ 46, నేత్రవల్కర్ 2/21, హర్మీత్ 2/24). **యూఎస్ఏ:** 20 ఓవర్లలో 176/6 (గోస్ 80 నాటౌట్ , హర్మీత్ 38, రబాడా 3/18, కేశవ్ 1/24)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.